# 5.

# సత్సంగత్వం

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః**
**సత్సంగముచే సహజ విరక్తి**
**ఆ విరక్తియే విగతభ్రాంతి**
**భ్రాంతి తీరితే శాంతి స్థిమితము**
**స్థిమితము శాంతియే జీవన్ముక్తి**

పవిత్రాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

మానవజీవితమునకు మహత్తరమైన ప్రక్రియ ఆత్మవిశ్వాసము, మానసిక శుద్ధి. జీవితమున మానవుడు ఒంటరిగా జీవించటానికి వీలుకాదు. జగత్తులో వ్యక్తి జీవితము సమాజముపైన ఆధారపడి ఉంటుంది. అట్టి పవిత్రమైన సమాజము యొక్క స్థితి ఒక్క భారతదేశమునకే ప్రాప్తమైనది. ఇట్టి పవిత్రమైన సామాజిక వ్యవహారములు, సహన భావములు యితర దేశములందు అందుకోనుటకు సాధ్యము కాదు. భారతీయుల దేహమందు జలము ప్రవహించలేదు. రక్తము ప్రవహించుచున్నది. భారతీయ సంస్కృతి యొక్క పవిత్రతను భారతీయ యువకులు పునరుద్ధరింపజేసే నిమిత్తమై తగిన ప్రయత్నమునకు పూనుకోవాలి. సత్యమునకై మీ జీవితమును అర్పితము చేయటానికి సంసిద్ధులై ఉండాలి యీనాటి యువకులు. అట్టి సత్యమార్గమును అవలంబించి, సత్యజ్యోతిని వెలిగించి సత్యదేశము అని సార్థక నామాన్ని అందుకొన్నది ఈ భారతదేశము. దేశకాల పరిస్థితుల ప్రభావమునకు లోబడి నేడు అట్టి సత్యమునకు భారతీయులు అతి దూరమై హాస్యాస్పదమునకు గురిఅయ్యే పరిస్థితి ఏర్పడినది. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అనే సార్థకమైన పవిత్రమైన వ్యక్తిత్వాన్ని మనము ఈనాడు కృత్రిమమైన జీవితముగా అనుభవించుకోవలసిన అవసరము ఏర్పడినది. అట్టి మార్పు చెందిన భారతదేశమును తిరిగి మీరు పవిత్రమైన

sri sathyasai vachanamrutam

సనాతనధర్మంగా పునరుద్ధరింపచేయటానికి తగిన ప్రయత్నము చేసే నిమిత్తమై యిట్టి సమావేశములు ఏర్పరచి అనుభవజ్ఞులైన వ్యక్తులతో సంభాషణలు సల్పించి తద్వారా మీ హృదయములను పరివర్తనగావించే నిమిత్తము పూనుకోటమే మా యొక్క ప్రధానమైన లక్ష్యము. జగద్గురువైన శంకర భగవత్పాదులవారు అనేకరకములైన ప్రబోధలు సల్పి అద్వైత సిద్ధాంతమును స్థాపించి తనయొక్క శిష్యులద్వారా అనేక రకములైన అనుభూతులను, ఆత్మతత్త్వమును, పరమాత్మని విశిష్టతను కూడను వెదజల్లిన దానిలో, యీ సత్సంగమునకు ప్రధానమైన విశిష్టతను అందించినాడు. మోక్షమునకు సత్సంగమే ప్రధానమైన మొదటి మెట్టుగా బోధించాడు. ఇక్కడ సత్సంగమనే విషయములో చక్కగా విచారణ చేసినప్పుడు మంచి సహవాసము, మంచి మైత్రి అని. అయితే మంచి అనే దానికి విలువ ఎక్కడ ఉన్నది? మంచి అంటే ఏమిటి అనే విషయము విచారణ చేయాలి. దీనికి శంకరులవారు అనేకరకములైన ఆదర్శములను అందించినప్పటికిని సూక్ష్మమైన రూపములో వేమన యిట్టి సత్సంగము యొక్క భావమును అందిస్తూ వచ్చాడు. మంచివారు ఎవరనగా 'కడుపు చిచ్చుచేత, కామనలముచేత, క్రోధ అగ్నిచేత, కుటిలచేత' ఈ నాలుగు గుణములచేత ఎవరు ప్రవర్తిస్తుంటారో వాడు దుర్మార్గుడని, ఈ నాల్గు గుణములు లేనివాడే మంచి వ్యక్తి యని వేమన ప్రబోధించాడు. ఈ కడుపుచిచ్చుకోసమే పాటుపడే ప్రయత్నము మానవత్వానికి ఏమాత్రము సరియైన సార్థకత కానేరదు. పశుపక్షి మృగాదులు కూడను కడుపు చిచ్చు నిమిత్తమై అనేక శ్రమలు పడుతూ, సులభమైన మార్గములను అవలంబిస్తూ ఆనందిస్తున్నాయి. కానీ మానవుడై పుట్టి మానవత్వము దైవత్వమునకు సమీపమని విశ్వసించి, అట్టి పవిత్రమైన మానవులు కూడను కేవలము కడుపుచిచ్చు నిమిత్తమై బ్రతికే ప్రయత్నము చేయటము వేమన చాలా హాస్యాస్పదముగా భావించాడు.

**అడవి పక్షులకెవ్వడు ఆహారమిప్పించె**
**మృగ జాతికెవడు మేతబెట్టె**
**వనచరాదులకెవ్వడు భోజన మిప్పించె**
**చెట్ల కెవ్వడు నీరు చేదిపోసె**

రాతిలోని కప్పకు కూడా ఆహారమునందించే దైవత్వము నిరంతరము సమీపముగా వుండే



sri sathyasai vachanamrutam

సమయములో పుట్టించిన భగవంతుడు అన్నము పెట్టక పోడు. కనుక పుట్టించిన దైవమునే మనము ప్రార్థించి మన కర్తవ్యమును నిర్వర్తించుకునే సత్యమార్గమందు ప్రవేశించటమే మనయొక్క ప్రధానమైన విశిష్టత. మన తోటి మానవులు బాధలు పడుచుండగా మనము సాధ్యమైనంత వరకు వారికి సహాయము చేయటానికి తగిన ప్రయత్నం చేయాలి. మానవత్వములోనున్న ఏకత్వాన్ని మీరు గుర్తించుకోవాలి. మానవునికి మానవునికి మధ్యనున్న భావములు కూడను మనము కొంతవరకును అర్థము చేసుకోవాలి. అన్నింటియందున్న ఆత్మతత్వము ఏమిటో మనము విచారణ సల్పాలి. అప్పుడే brotherhood of man, fatherhood of God అనేది సార్థకమవుతుంది. ఈనాడు ఒకరికొకరు brothers, brothers అని శారీరక మానసిక తత్వములను ఏమాత్రము విశ్వసించక లౌకికమైన నిరుపయోగమైన పదములుగా మనము ఉపయోగ పెడుతున్నాము. శారీరక మానసికములకు అతీతమయిన తత్వమును మనము విచారణ సల్పినప్పుడే సరియైన సోదరత్వమును అభివృద్ధి పరచుకోటానికి అవకాశమవుతుంది. కనుక సోదరత్వము సరైన అర్థములో తీసుకోవాలనుకున్నప్పుడు One divine principle in all, అదే brotherhood of man. అట్టి సత్యాన్ని మనము యీనాడు గుర్తించుకోటానికి మనము ప్రయత్నము సల్పాలి. అట్టి సత్యమును గుర్తించుకునే నిమిత్తమే సత్సంగము అనేది అత్యవసరము. ఇట్టి సత్సంగము వలన కలిగే ఫలితమేమిటని మీరు యోచించవచ్చు. మానవుని మంచిచెడ్డలన్నియు సమాజము యొక్క చేరికతో, సంఘము యొక్క దోషముతో, సంఘము యొక్క మంచితనముతో రూపాన్ని తీర్చిదిద్దుకుంటున్నాయి.

**సత్సంగము యొక్క ప్రభావము**

భూమిపైన పడిన dust తనకు పైకి ఎగరటానికి యేమాత్రము రెక్కలు లేకపోయినప్పటికిని గాలి స్నేహము చేత dust పైకి ఎగిరి పోతున్నది. అదే మట్టి, నీటితో స్నేహము చేసుకోటం చేత అట్టడుగునకు దిగిపోతున్నది. కఠినమైన అంధకార రూపమైన ఇనుము, అగ్నితో స్నేహము చేసుకోవటంచేత మెత్తగా ప్రకాశవంతముగా రూపొందుతున్నది. అదే మట్టితో చేరినప్పుడు rust పట్టి తన శక్తినంతా burst చేసుకుంటున్నది. ఇవన్నీ సంఘముల వలనే జరుగుతున్నాయి గాని, సమాజము యొక్క స్నేహము చేతనే జరుగుతున్నది గాని, కేవలము తనకు తాను మారటంగాని, తనకు తాను పరివర్తన పొందటం గాని ఏమాత్రం మానవునకు సాధ్యముకాదు. పుట్టిన బిడ్డకు కూడను



sri sathyasai vahanamrutam

తల్లియొక్క ప్రోత్సాహముచేత తల్లియొక్క ప్రేమ, వాత్సల్యములచేత మాటలాడటంగాని, నడవటంగానీ, చదవటంగానీ, వ్రాయటంగానీ అనేకరకములైన విద్యలకు యితరుల యొక్క ప్రోత్సాహముచేతనే అభివృద్ధి పొందుతున్నాడు. అట్టి సహాయమే ఆ బిడ్డకు లేకుండిన మృగము వలే, తాను కూడా మాటలాడలేని స్థితిలో పడి యుండెడివాడు. అడవులయందు పుట్టి అడవులయందు పెరిగి అడవులయందు సంచరించే మృగములకు ఎట్టి అభ్యాసములున్నవో అవే ఆ మృగములకు ఉంటాయి. కానీ అట్టి మృగములను ఏ సర్కస్ వాడైనా, ఏ ప్రత్యేక శిక్షణ అందించే వాడైనా చెంతకు తెచ్చుకొని ప్రత్యేకమైన తర్ఫీదువల్ల ఉత్తమమైన స్థితిని కల్పిస్తున్నాడు. పక్షులను కూడను మనము చెంతచేర్చి కొన్ని రకములైన పలుకులను నేర్పించటం చేత, అభ్యాసముచేత, ఆ సంఘము చేత, ఆ స్నేహము చేత అవికూడను కొన్ని రకములైన పలుకులు స్పష్టముగా పలకటానికి పూనుకుంటాయి. కనుక, ఏ పవిత్రమైన దివ్య జీవితముగా మనము జీవించాలని ఆశిస్తున్నామో ఆ ఆశకు తగినట్లుగా మనము మంచివారి స్నేహము చేయటము మంచివారి మాటలు వినటము, మంచివారి జీవితము అనుసరించటము మంచి వారి అడుగుజాడలలో నడవటము తగిన రీతిగా మనము పూనుకోవాలి. ఆవిధమైన జీవితము జరుపుటకు యిది చక్కటి వయస్సు. యిట్టి పవిత్రమైన వయస్సునందు పవిత్రమైన భావములను, పవిత్రమైన సంస్కృతిని, పవిత్రమైన దీక్షను, పవిత్రమైన జీవితాన్ని మనము అభివృద్ధి పరచుకోవటానికి మనము పూనుకోవాలి. ఈ వయస్సునందు కాలమును అతి పవిత్రమైనదిగా విశ్వసించి, కాలమును వృథాపరచక దేశసేవ, మాతాపితరులసేవ, మన సంస్కృతికి పేరు మనము చేయటానికి పూనుకోవాలి. అట్లుకాక కాలమును వృధాపరచి, దుస్సంగములో చేరి బజార్లో కుక్కలవలె తిరుగుతూ, నక్కలవలె అరుస్తూ మనము జీవితమును వ్యర్థము చేసుకోవటంలో యేమాత్రము సార్థకత ఉండదు. Time waste is life waste. కాలము వ్యర్థము చేయటం జీవితం వ్యర్థము చేయటమే. సత్సంగము యొక్క ప్రభావాన్ని చక్కని రీతిలో మనము విచారణ చేసినప్పుడు ఎంతయో దివ్యత్వమును అందుకోటానికి అవకాశము ఉంటుంది. దీనికి చిన్న ఉదాహరణము. మంచివారి యొక్క బుద్ధులు మంచివారి యొక్క నడతలు, మంచి వారియొక్క పలుకులు మధురమైనవిగాను, గౌరవమైనవిగాను, కీర్తివంతమైనవి గాను ఉంటుంటాయి. అది ప్రకాశవంతమైన అగ్నివలె ఉంటుంటాది. అట్టి

srisathyasaivachanamrutam

ప్రకాశవంతమైన అగ్నికి ప్రక్క, లోపల అంధకారమైన బొగ్గును తెచ్చి మనము చేర్చినప్పుడు ఆ అగ్నికి ఎంతవరకు సంఘము చేరి ఉంటుందో ఆ భాగమంతా యీ బొగ్గులో ప్రకాశవంతమైపోతుంది. ఈ ప్రకాశవంతమైన అగ్నికి అజ్ఞానమైన బొగ్గును చేర్చటమే కాదు, ఎంతవరకు చేర్చితిమో అంతవరకే ప్రకాశము ఏర్పడుతుంది. దానిని ఆచరణ అనే సాధన క్రింద దానినే ఒక ఫ్యానుగా భావించుకొని ఆచరణనే ఫ్యానుగా విసిరినప్పుడు బొగ్గు పూర్తి అగ్నిగా మారిపోతుంది. కనుక మంచి వారికి దగ్గర ఉండటము మాత్రమే ప్రధానము కాదు. దానికి తగిన ప్రేమతత్త్వాన్ని మనము చేర్చుకోవాలి. కనుకనే near and dear. ఈ రెండింటి యందు మన జీవితము చేర్చినప్పుడు మన జీవితము కూడను ప్రకాశవంతముగా ఉంటుంది.

**సద్భావములు క్షీణించటానికి కారణం దుస్సాంగత్యం**

ఇంక చెడ్డవారి యొక్క తత్త్వము యేరీతిగా ఉంటుందంటే యితరుల యొక్క కష్టనష్టములు చెడ్డవారికి అత్యంత ఆనందాన్ని కలిగిస్తాయి. ఇతరులు ఏమైనా బాధలు పడుతుంటే వీరికి చాలా ఆనందము వేస్తుంది. ఉత్తమమైన కీర్తిని ఆర్జించే వ్యక్తులను చూచి దుర్మార్గులు ఓర్వలేని కథలను కల్పించి వారిని నిందల పాలు చేస్తుంటారు. వారు సహస్ర నేత్రములతో యితరులలోనున్న దోషములు చూడటానికి ప్రాకులాడుతుంటారు. కనుక ఇట్టి వారి సంఘము మనకు కూడా ప్రాకటానికి పూనుకుంటుంది, తద్వారా మనము కూడా ఆ వ్యక్తులలో ఒకరిగా మారిపోవటానికి అవకాశముంటుంది. కానీ, అట్టి వారి సంఘమునకు మనము దూరముగా ఉండటము చాలా మంచిదని కూడను శంకరులవారు ప్రబోధించారు. అయితే అట్టివారికి మనము దూరముగా ఉండటము చేత అట్టివారు బలిసి మరింత దేశానికి అపకారము చేయటానికి పూనుకోవచ్చును కదా! కనుక అట్టివారితో మనము చేరి వారిని మనలో చేర్చుకోవచ్చునని కొంతమంది ఊహలు. అయితే ఎంతవరకు ఆ చెడ్డవారికి దూరంగా వుండాలనే దానిని కూడను మనము విచారించాలి. మనలో మంచిపైన ఉన్న విశ్వాసము, సత్యముపైన ఉన్న విశ్వాసము గాఢమైనదిగా పెంచుకున్న తదుపరి అట్టివారితో మనము కూడి, అట్టివారిని కూడను మన మార్గములో తెచ్చుకోవటానికి పూనుకోటంలో ఒక విధమైన ఫలితము ఉంటుంది. కాని, అలాంటి సత్యమునకు సరియైన బలము, మంచికి తగినటువంటి విశ్వాసము, పవిత్రతకు తగినటువంటి దీక్ష మనలో లేనప్పుడు అట్టివారితో చేరటము మనయొక్క సద్భావములు క్షీణించటానికి అవకాశము ఉంటుంది. మనలో

quality and quantity ని అభివృద్ధి చేసుకున్నప్పుడే యితరుల యొక్క స్వల్పమైన దానిని మనలో చేర్చుకుని తద్వారా యీ స్వరూపకంగా ఆ స్వరూపాన్ని మార్చుటానికి అవకాశముంటుంది. దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక కప్పు నీరు తీసుకుని 'అయ్యా! ఈ కప్పు నీరు అర్ధరూపాయికి తీసుకుంటావా' అంటే ఎవరూ తీసుకోరు. పదికప్పుల పాలలో యీ కప్పునీరు కలుపుతే పాల వెల దీనికి యిస్తారు. ఈ 10 కప్పుల పాలు quantity and quality. రెండింటియందు అధికస్థానము చెందటంచేత యీ నీటికి కూడా విలువ వచ్చింది. అట్లుకాకుండా ఒక కప్పునీరు, ఒక కప్పు పాలు కలుపుతే పాల విలువ కూడా పోతుంది. అట్లే సరిసమానమైన స్థితియందే దీని విలువ దిగజార్చకుండగా అనేక కప్పుల జలములో ఒక కప్పు పాలు చేరుస్తే పాలయొక్క విలువ పూర్తిగా నశించిపోతుంది. అదేవిధముగా మన హృదయములో, వెలపల చక్కని భావములు, ఉత్తమమైన భావములు అభివృద్ధి చేసుకునే అవకాశములు కల్పించుకున్నప్పుడు మనలోనున్న విశ్వాసము తరగక చెదరక ఉండటానికి అవకాశము ఉంటుంది. దీనికే రామకృష్ణపరమహంస ఒక చక్కని ఉదాహరణము నందించాడు. మనము ఒక ఊదొత్తి అంటిస్తుంటాము. ఊదివత్తులయందు అగ్నియే ఉన్నది. మరొకడు సిగరెట్టు కాలుస్తుంటాడు. దానియందు కూడను అగ్నియే ఉంటుంది. మనము వంట చేసుకుంటున్నాము. వంటపొయ్యియందు అగ్నియే ఉంటుంది. కానీ అడవి జ్వాలలుగా మండుతున్న సమయమునందు అది కూడా అగ్నిగానే ఉంటుంది. ఈ ఊదివత్తి అగ్నిపైన, సిగరెట్టు అగ్నిపైన ఎండిన కట్టెపుల్లలు తెచ్చినప్పటికిని ఆ అగ్ని ఆరిపోతుంది. ఈ పుల్లలను దహనము చేయకుండా ఆ అగ్ని ఆరిపోతుంది. వీటిని దహింపచేసే శక్తి లేక అది కూడా ఆరిపోతుంది. ఈ కొండలలో మండుతున్న అగ్నియందు పచ్చి అరటి చెట్టు వేస్తే ఆ అరటిచెట్టుకూడను భస్మమైపోతుంది. కారణము ఏమిటి? ఇక్కడున్న అగ్ని quality and quantity తక్కువగా ఉంటున్నాది. ఆ అడవియందు ప్రజ్వరిల్లుచుండిన అగ్ని quantity and quality అధికంగా ఉంటున్నాది. ఇలాంటి పరిస్థితియందు, ఎట్టి భేదభావములు లేని చిత్తములైనా, ప్రవర్తనలైనా మనము చేరినప్పుడు మనయొక్క భావము ఆ రెండవదానిని పూర్తి వశము చేసుకోవటానికి అవకాశముంటుంది.

sri sathyasai vachanamrutam

## ఆధ్యాత్మికత తగ్గటానికి కారణం ఆధ్యాత్మిక వాతావరణం లేకపోవటమే

మరొక ఉదాహరణము. ఒక మట్టి పాత్రలో మనము నిండుకు నీరు పోసి పెట్టాము. ఆ మట్టికుండను ఒక చీమైనా ముట్టని ప్రదేశములో మనము భద్రము చేసి పెట్టాము. రెండవ దినము చూచేటప్పటికి ఆ పాత్రలో నీరు ఒకటి రెండు యించీలు తక్కువైపోయి ఉంటాయి. కారణము ఏమిటి? వెలుపలనున్న వాతావరణము ఈ పాత్రను కొంతవరకు వేడిచేయటము చేత అందులో నున్న జలము తాను పీల్చుకుంటున్నాది. అదే ఒక మట్టి పాత్ర కంఠము వరకు నీరు నింపి, కంఠము వరకు నీరు బయట ప్రదేశములో పెట్టినప్పుడు ఆ పాత్రలోని జలము ఒక్క చుక్కైనా తక్కువ కావటానికి వీలు లేదు. అదేవిధముగా ఈ సమ్మర్ క్లాసులలో ప్రవేశించి ఒక నెల దినములు యిక్కడ ఉండటంచేత మీ హృదయ పాత్రలోపల ఆధ్యాత్మిక రసమనేది నింపుకున్నారు. నింపుకున్న తరువాత తిరిగి మీ ప్రదేశమునకు పోయినప్పుడు అక్కడ యీ ఆధ్యాత్మిక వాతావరణము లేకపోవుట చేత మీలోనున్న ఆధ్యాత్మిక రసము క్రమక్రమేణా తగ్గిపోవటానికి అవకాశము ఉంటుంది. అదికాకుండా అక్కడ కూడను అప్పుడప్పుడు యిలాంటి సంత్సంగములో చేరి విన్నటువంటి విషయములు, పెద్దలు బోధించిన విషయములు మననము చేసుకుంటూ, యీ సంఘముతో ఆ సంఘము చేర్చుకున్నప్పుడు మీరు నింపుకున్న పవిత్రమైన సారము యే మాత్రము తరిగిపోకుండా ఉంటుంది అని మీరు విశ్వసించాలి. ఏదో సమయము వున్నప్పుడు అనేక రకములైన సంఘములు చేరుతుంటాయి. ఒకానొక సమయములో చెడ్డవారుగూడను మన సంఘములో చేరటానికి అవకాశము ఏర్పడవచ్చును. అట్టి సమయమునందు వారు ఎట్టి దుష్కృత్యములు ఆడినప్పటికిని, చేసినప్పటికిని, ఉపయోగపెట్టినప్పటికిని మనము నింపుకున్న పవిత్రభావములే వారికి అందించటానికి పూనుకోవాలి. కఠినమైన గొడ్డలి చందనపు చెట్టును కొట్టినప్పుడు ఆ చెట్టు యేమాత్రము విచారించక తనలోనున్న సుగంధాన్ని ఆ కఠినమైన గొడ్డలికి కూడను అందిస్తుంది గాని దానిని యేమాత్రము తూలనాడదు. కాని, గంధము చెక్కను ఎన్ని విధములుగా హింసించినప్పటికిని ఎన్ని రకములుగా రాతిలో అరగదీసినా దీనిలోనున్న సుగంధాన్ని తనకు చేరిన పదార్థమును అందిస్తుంది. యిది మంచి వారి యొక్క లక్షణాలు. ఆ గంధము చెట్టుకు కొట్టిన గొడ్డలికి ఎలాంటి శిక్ష తెలుసునా? గొడ్డలిని అప్పుడప్పుడు అగ్ని సంస్కారము గావించి సుత్తితో

కొట్టుట అనేక రకములుగా శిక్ష జరగుతుంది. ఒకానొక కంసాలి బంగారును కరగించే సమయములో అనేక రకములుగా చింతలు చేయుచు, 'బంగారు నీకున్న విలువ మరెవరికీ లేదు. అయినప్పటికిని యిప్పుడు నా చేతిలో చిక్కినావు అగ్నిలో వేసి కాల్చి కరిగించుతున్నాను. సుత్తితో కొట్టుచున్నాను' అని బంగారుతో సంభాషణ సల్పుతున్నప్పుడు ఆ బంగారు చెప్పింది, 'ఓ కంసాలి! నీవు అనేక విధములుగా హింసించినప్పటికిని, కాల్చినప్పటికిని, కరిగించినప్పటికిని నాలో ఉన్న మాలిన్యముపోయి నేను సుందరమైన నగగా తయారవుతున్నాను గాని నన్ను కాల్చటం వల్ల వచ్చిన పొగ నీకండ్లనే బాధిస్తున్నది. సుత్తితో కొట్టటం వల్ల నీచేయి నొప్పి పెడుతుంది. కానీ నాకు ఎట్టి అపాయముగాని, నా గౌరవమునకు ఎట్టి హాని జరగటం లేదని' నవ్వి ఊరుకొన్నదట. కనుక మంచివారిని, పవిత్రమైన జీవులను ఉత్తమమైన మహనీయులను అనేక రకములుగా తూలనాడినప్పటికిని అనేక రకములుగా హింసించినప్పటికిని ఆ హింసలు వారికే మాత్రము చెల్లవు. ఆ దూషణ భూషణ తిరస్కారములకు వారు అతీతమైన స్థానమునందుంటారు. ఎవరు దూషించారో, ఎవరు తిరస్కరించారో, ఎవరు బాధించారో ఆ బాధలు వారికే గానీ వీరికి ఏమాత్రము ఉండవు. కనుక అట్టి ఉత్తమమైన చిత్తము కలిగిన పెద్దల చెంత చేరి మీయొక్క జీవితమును పవిత్రము గావించుకోవటానికి పూనుకోవటం, ఇది చక్కని వయస్సు కావటంచేత మీరు ఈ సమావేశమందు చేరి, యీ పెద్దలు బోధించిన విషయములు మీరు మార్గముగా భావించి, నిత్య జీవితములో వాటిని ఉపయోగపరచి మీరు సార్థకము చెందుతారని నేను ఆశిస్తున్నాను. సత్యము, త్యాగము, ప్రేమ, సహనము యీ నాల్గింటిని చేర్చుకుని సౌశీల్యమైన జీవితంగా మనం తయారుకావాలి. ఇది పిల్లలయొక్క జీవితమునకు ప్రాతః కాల సమయము. ప్రాతఃకాల సమయము నందు పరమాత్ముని వైపున, ఏ మంచి వైపున ముఖమును మరల్చి మన జీవితమును ప్రారంభించినప్పుడు మనకు యేమాత్రము చెడ్డ అని గాని, మాయ అనిగాని, ego అనిగాని, దుర్గుణములుగాని మనలను వెంటాడుటకు అవకాశము ఉండదు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. తెల్లవారే సమయమునందు సూర్యోదయము జరుగుతుంటుంది. ఆ సమయములో మనము సూర్యుని వైపున దృష్టి మరల్చి చూస్తుంటే మన నీడ మన వెనుక పొడవుగా ఉంటుంది. అయితే తిరిగి సూర్యుని

sri sathyasai vahinamrutam

దిశకు దృష్టిని మరల్చక మన నీడవైపున దృష్టి మరల్చిన మన నీడ మనకంటే అధికముగా ఉండి, మనకంటే ముందుగా వెడుతూ మనకు దారి చూపించే దానిగా కనిపిస్తుంది. ఇక్కడ నీవే జీవతత్త్వము, నీ నీడయే మాయ యొక్క శక్తి. మాయను నీవు వెనుక వెయ్యాలని, మాయను ముందుపెట్టుకుని ఎంత దూరము నడచినప్పటికిని, ఎంత వేగముగా నడచినప్పటికిని దానిని వెనుక వెయ్యలేవు. అట్లుకాక సులభముగా నీ దృష్టిని సూర్యునివైపు మరల్చితే మాయ నీకు సులభముగా వెనుకపడిపోతుంది. కనుక నీవు దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము యింద్రియముల యొక్క సంబంధమే మాయ యొక్క నీడ. అట్లుకాక నీ దృష్టిని ఆత్మవైపు మరల్చితివా నీ మనస్సు, బుద్ధి, చిత్తము, యింద్రియముల తత్త్వము యేమాత్రము లక్ష్యము చేయక నీవు పవిత్రమైన దృష్టియందే నీ జీవితము సార్థకము గావించుకుంటావు. కనుక యిట్టి సత్సంగమును చేరి, సత్సంగము వలన లభించే పవిత్రమైన ఫలితము మన జీవితములో అనుభవించుటకు పూనుకోవాలి.

**సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః**

అనే దానిలో ఎంత పవిత్రమైన అర్థమున్నదో మీరు అనుభవించినప్పుడే అర్థమవుతుంది. గాని అనుభవించక కేవలము శ్లోకములు ఉచ్చరించటం మాత్రము చేత ఏమాత్రము ఆనందమును అందుకోలేరు. పవిత్రమైన యీ పదములు, ఈ శ్లోకములు, శంకరులవారు లోకానికి అందించటం చేత, ఒక్కొక్క శ్లోకము ఒక దీపమువలే మనకు మార్గదర్శకమైన పవిత్రమైన జ్యోతివలే మన జీవితములో ఆచరించటానికి తగినట్లుగా మనము పూనుకోవాలి.

ఈనాడు శంకరులు అందించిన భజగోవిందము యొక్క శ్లోకములలో సత్సంగము యొక్క శ్లోకమును అంతరార్థముగా మనము అనుభవిస్తున్నాము. ఇది కేవలము ఆచరణశుద్ధిగా అనుభవించుకోటానికి తగిన ప్రయత్నము చేసినప్పుడు ముమ్ముందు సత్సంగము ద్వారానే ఏఏ వాంఛలు, ఏఏ ఆత్మ తత్త్వములు అందుకోవాలో యీ సత్సంగమునందే లభించటానికి అవకాశము ఉంటుందని మీరు విశ్వసించి సత్సంగమును మీరు యేనాడు దూరము చేసుకొనక, దుస్సంగముతో యేనాటికి చేరటానికి మీరు అభిరుచి



srisathyasaivachanamrutam

పడక జీవితమును యిదే రీతిగనే శుద్ధమై, నిర్మలమై, నిస్వార్థమై, పవిత్రమైన పరతత్త్వము క్రింద మీరు ప్రవేశ పెడతారని నేను ఆశిస్తున్నాను.

## మంచివారి వియోగం - చెడ్డవారి సంయోగం రెండూ బాధలే

కబీరు కూడను ఈ సత్సంగమునకు, దుస్సంగమునకు ఒక్క నమస్కారము చేసి 'ఓ దుస్సంగమా! నీకు ఒక నమస్కారము. ఓ సత్సంగమా! నీకు ఒక నమస్కారము' ఇరువురు నమస్కార అర్హులేనని చెప్పాడు. ఇరువురు నమస్కార అర్హులని చెప్పటంచేత చెంతనున్న శిష్యులు తిరిగి గురువును ప్రశ్నించినారు, 'స్వామీ! దుర్మార్గులు కూడా నమస్కార అర్హులౌతారా?' అని. అప్పుడు కబీర్ చెప్పాడు, 'నాయనా! చెడ్డవారితోనూ లోకమునకు ఒక బాధ ఉంది. మంచి వారితోనూ లోకమునకు ఒక బాధ ఉంది. చెడ్డవారుగాని, మంచివారుగానీ లోకమునకు బాధనివ్వకుండా ఉండే నిమిత్తమై యిద్దరికి నమస్కారము చేస్తున్నాను' అన్నాడు. అప్పుడు శిష్యులు, స్వామి 'మంచివారితో జగత్తుకు మంచియే జరుగుతుంది గాని చెడ్డ జరగటానికి అవకాశము లేదే' అని ప్రశ్నించారు. అప్పుడు కబీరు చిరునవ్వు నవ్వుతూ, 'నాయనా! మంచివారి వియోగము చెడ్డవారి సంయోగము చాలా బాధను కలిగిస్తుంది కనుక మంచి వారి వియోగము రాకుండా, చెడ్డవారి సంయోగము రాకుండా యిద్దరికి నమస్కారముచేస్తున్నాను' అన్నాడు. కాన చెడ్డవారితో సంయోగము, మంచివారితో వియోగము కాకుండా వుండే నిమిత్తమై యిరువురికి నమస్కారము చేసుకుంటూ, నిరంతరము సత్సంగముయొక్క సంయోగానికి మీరు ప్రయత్నంచేయాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 24-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam